క్లుప్తంగా

'ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

పెంచికల్‌పేట్‌: బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌పైన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసత్య ఆరోపణలు సరికావని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేసేందుకు వచ్చిన ఆర్‌ఎస్పీపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు షరీఫ్‌, దేవాజీ, వాసాల రాజవర్ధన్‌, గంగరాం, దేవదాస్‌, బాబులాల్‌, చింటూ, తులసిరాం, ప్రదీప్‌ పాల్గొన్నారు.

భద్రకాళీ ఆలయంలో జాతర



పూజలు చేస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్‌: మండలంలోని పంచకళ్ళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా రెండో రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ పీఠాధిపతి శివ ప్రసాద్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. జాతర చివరి రోజు ప్రభల ఊరేగింపు, అగ్ని గుండాల ప్రవేశానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బోనాలు



బోనాలతో మహిళలు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా జాతర నిర్వహించిన మరుసటి బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఉమాచంద్రశేఖర ఆలయం వద్ద బోనాల నైవేద్యం వండి మొక్కులు చెల్లించారు.

జీఎంకు సన్మానం

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్‌ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్‌రెడ్డిని గురువారం ఏరియాకు ఏఐటీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ ఆవరణలో ఏఐటీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్‌ డిప్యూటీ సెక్రటరీ ప్రకాష్‌రావు, పల్లాస్‌, హుస్సేన్‌, సంజీవరెడ్డి, రా మారావు, మాధవకృష్ణ, చంద్రకుమార్‌, శ్రీనివాస్‌, నారాయణ, భీమేష్‌ పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌ ఆధ్వర్యంలో..

ఏరియా నూతన జీఎంగా వచ్చిన విజయ భాస్కర్‌రెడ్డిని గురువారం బెల్లంపల్లి ఏరియా హెచ్‌ఎంఎస్‌ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఓజియార్‌, గౌస్‌, దత్తు, ఆరీఫ్‌, ఉమా మహేశ్వర్‌రావు, కిష్టస్వామి, తిరుపతి పాల్గొన్నారు.

వైద్య శిబిరం

నేరడిగొండ: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్‌ రవీందర్‌ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.



లింగాపూర్‌: పరిశీలిస్తున్న సీఐ రమేశ్‌



వాంకిడి: ఓటువేసిన పట్టభద్రులు



బెజ్జూర్‌: క్యూలో ఉన్న ఓటర్లు



దహెగాం: క్యూలో నిలబడిన ఓటర్లు

ముగిసిన పోలింగ్‌

జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల, టీచర్‌ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఓటేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎన్నికల అధికారులు పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్‌ అనంతరం బ్యాలెట్‌ బాక్స్‌లను కౌంటింగ్‌ కేంద్రాలకు తరలించారు. – సాక్షి, నెట్‌వర్క్‌

- ముగిసిన పట్టభద్రుల, టీచర్‌ ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఓటేసేందుకు పోటెత్తిన ఓటర్లు



రెబ్బెన: ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

- రెబ్బెన మండలంలో 727 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. 561 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 77 శాతం ఓటింగ్‌ నమోదైంది. 29 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 28 మంది ఓటు హక్కును వినియోగించుకోవటంతో 96 శాతం పోలింగ్‌ నమోదైంది.
- పెంచికల్‌పేట్‌లో 159 మంది పట్టభద్రులకు 134 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యా ఓట్లు రెండు వినియోగించుకున్నట్లు తహసీల్దార్‌ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పోలింగ్‌ కేంద్రాన్ని కాగజ్‌నగర్‌ సబ్‌కలెక్టర్‌ శ్రద్ధా శుక్లా పరిశీలించి పోలింగ్‌ సరళిని అడిగి తెలుసుకున్నారు.
- చింతలమానెపల్లి మండలంలో 266 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 227 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీంతో 85.3శాతం పోలింగ్‌ నమోదైంది. ఉపాధ్యాయ పోలింగ్‌ వందశాతం నమోదైంది. ఏఎస్పీ ప్రభాకర్‌ రావు పోలింగ్‌ సరళిని పరిశీలించారు.
- సిర్పూర్‌(టి) మండలంలో పట్టభద్రుల ఓటర్లు 330 ఉండగా 259 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో ఇద్దరు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటువేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 23 మందికి 21 మంది ఓటు వేశారు. అడిషనల్‌ రాయల ప్రభాకర్‌ పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్‌ సరళిని పరిశీలించారు.
- కౌటాల మండలంలో 25 మంది ఉపాధ్యాయ ఓటర్లకు 23 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 393 మంది పట్టభద్రులకు 291 మంది పట్టభద్రులు ఓటు వేశారు. కౌటాల పోలింగ్‌ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌) ప్రభాకర్‌రావు పరిశీలించారు. కౌటాలలో పోలింగ్‌ సరళిని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ పరిశీలించారు.
- బెజ్జూర్‌ మండలంలో 317 పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. 232 మంది ఓటు వేశారు. 73 శాతం పోలింగ్‌ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 13 ఉండగా, 12 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 92 శాతం పోలింగ్‌ నమోదైంది.
- కెరమెరి మండలంలో 192 మంది పట్టభద్రులకు 162 మంది తమఓటు హక్కు వినియోగించుకున్నారు. 84 శాతం పోలింగ్‌ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 20 మంది ఉండగా.. 16 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80 శాతం పోలింగ్‌ నమోదైనట్లు తహసీల్దార్‌ దత్తు ప్రసాద్‌ తెలిపారు.
- వాంకిడి మండల కేంద్రంలో 216 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 181 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 16 మంది ఉండగా 12 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్‌ వెంకటేశ్‌ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌ రావులు పోలింగ్‌ సరళిని పరిశీలించారు. ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.
- లింగాపూర్‌లో 107 మంది పట్టభద్రులు ఉండగా.. 86 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓట్లు 14 ఉండగా.. 10 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్‌ పెద్దిరాజు తెలిపారు.
- దహెగాం మండలంలో పట్టభద్రులు 232 మందికి 161 మంది, ఉపాధ్యాయ ఓట్లు 10 మందికి 7గురు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్‌ అధికారి ప్రణీత్‌ తెలిపారు. పోలింగ్‌ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సిర్పూర్‌(టి): పరిశీలిస్తున్న అడిషనల్‌ ఎస్పీ ప్రభాకర్‌



కౌటాల: ఓటు వేసిన పట్టభద్రులు



కెరమెరి: సిరాచుక్క చూపిస్తున్న పట్టభద్రులు



చింతలమానెపల్లిలో..

'రైతులకు అండగా ఉంటా'



ఎండు మిర్చిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: మిర్చి రైతులకు అండగా ఉంటానని సిర్పూర్‌ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం తాటిపల్లి గ్రామంలో ఎండు మిర్చిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో మిర్చి రైతులకు ఉచిత కరెంట్‌తో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా కృషి చేశానని తెలిపారు. సిర్పూర్‌లో మిర్చి సాగుతో రైతులు ఆర్థికంగా వృద్ధి చెందుతారని, రైతులు పంటలు మార్పిడి చేయాలని పేర్కొన్నారు. ఈసారి మిర్చి ధర ఆశించిన స్థాయిలో లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట నాయకులు కుమురం మాంతయ్య, వసంత్‌రావు, మధుకర్‌, మౌనీశ్‌, సంతోష్‌, మనీష్‌, శ్రీనివాస్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌



ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌

ఆసిఫాబాద్‌రూరల్‌: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌ ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా మేధావులైన ఓటర్లు న్యాయపరమైన తీర్పు ఇస్తురాని భావిస్తుమన్నారు. సంఘం నాయకులు రమేశ్‌, ఊషన్న, నవీన్‌, హేమంత్‌, తదితరులు పాల్గొన్నారు

మార్చి 1 నుంచి హనుమాన్‌ దీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: మార్చి 1 నుంచి హనుమాన్‌ మండల (41 రోజుల) దీక్షలు ప్రారంభం కానున్నట్లు జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్‌ హనుమాన్‌ ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌ మాలధారణను స్వీకరించే భక్తులు శనివారం ఉదయం 6 గంటలకు కేస్లాపూర్‌ హనుమాన్‌ ఆలయానికి చేరుకోవాలని కోరారు.

సామూహిక వివాహాలు పేదలకు వరం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వివాహ ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్‌: సామూహిక వివాహాలు పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సిర్పూర్‌(యూ) మండలంలోని మహాగాం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా సూరోజీ బాబా పుణ్యతిథిని పురష్కరించుకుని గురువారం నిర్వహించిన సామూహిక వివాహాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది 15 జంటలకు వివాహాలు జరిపించడం అభినందనీయమన్నారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తీసుకువచ్చిన కల్యాణలక్ష్మి పథకాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, పీఠాధిపతి కైలాష్‌, కమిటీ సభ్యులు గేడం జగ్జీవన్‌, మెస్రం లక్ష్మణ్‌, ఆత్రం ఆనంద్‌ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలోని శ్రీసిద్ధి హనుమాన్‌ మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాటు పడవలపై జాతరకు వచ్చి వార్ధ నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల వార్ధా నది తీరం జనజాతరను తలపించింది. అనంతరం ఆలయంలోని హనుమాన్‌ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్‌ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆలయ కాల్యెండర్‌ ఆవిష్కరించారు.

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి దేవస్థానంలో గురువారం అమవాస్య సందర్భంగా భక్తులు కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవ స్వామికి, ఆలయ ప్రాంగణంలో ఉన్న అరుణాచల శివయ్య విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు.

వాంకిడి: మండల కేంద్రంలోని చిక్లీ వాగు తీరంలో నిర్వహించిన జాతర రెండో రోజు జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించారు. గురువారం వారసంత ఉండడంతో జనాల తాకిడి భారీగా పెరిగింది.

కాటికి కారు చీకటే..!

- ఆఖరి మజిలీకి తప్పని తిప్పలు
- శ్మశానవాటికకు విద్యుత్‌ సౌకర్యం కరువు
- చేతిపంపులు, చెరువుల వద్ద పరుగులు



నిరుపయోగంగా సుర్దాపూర్‌ శ్మశానవాటిక మరుగుదొడ్లు



విద్యుత్‌ సదుపాయం లేని గోయగాం శ్మశానవాటిక

కెరమెరి: ఆఖరి మజిలి సజావుగా సాగాలని గత ప్రభుత్వం వైకుంఠధామాల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చింది. వైకుంఠధామాలు నిర్మించినప్పటికీ వాటికి విద్యుత్‌ సౌకర్యం కల్పించలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 31 వైకుంఠధామాలు నిర్మించారు. కాని చాలా చోట్ల వాటికి విద్యుత్‌ సౌకర్యం కల్పించ లేదు. బోరుమోటార్లు పని చేయని పరిస్థితి. చాలా చోట్ల ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. విద్యుత్‌ కనెక్షన్‌ కోసం అధికారులను అడిగితే గ్రామానికి వైకుంఠధామాలు దూరంగా ఉండడం వల్ల ఖర్చు ఎక్కువవుతుందని పేర్కొంటున్నారు. దీంతో కారు చీకట్లోనే అంత్యక్రియలు చేస్తున్నారు.

నీటి వసతి కరువు..

శ్మశాన వాటికల్లో మహిళలు, పురుషులు స్నానాలు చేసేందుకు వేరువేరుగా స్నానపు గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినా వాటికి నీటి వసతి లేక పోవడంతో ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. లేదంటే సమీప చేతిపంపులు, వ్యవసాయ బోర్లు, చెరువుల వద్దకు వెళ్లి స్నానాలు చేయాలి. దహన సంస్కారాలు అరకొర వసతుల మధ్య పూర్తి చేయడం కుటుంబీకులను కలిచి వేస్తుంది.

సర్కారుపైనే భారం..

వైకుంఠధామాలు విద్యుత్‌ లైన్లకు దూరంగా ఉన్నాయి. వీటికి ప్రత్యేక స్తంభాలు వేయాలి. ఇందుకోసం రూ.1 నుంచి 3 లక్షల అవసరముంటుందని విద్యుత్‌ అధికారులు చెబుతున్నారు. విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, స్తంభాలకు కనీస అంచనాలు కూడా తయారు చేయలేని పరిస్థితి విద్యుత్‌శాఖది. రూ. కోట్ల నిధులు వెచ్చించి శ్మశాన వాటికలు నిర్మించిన గత సర్కారు కరెంటు కనెక్షన్‌ ఇవ్వలేదని ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్‌ కనెక్షన్‌ ఇస్తాం



శ్మశాన వాటికలు గ్రామాలకు చాలా దూరంలో ఉన్నాయి. వాటికి స్తంభాలు, విద్యుత్‌ తీగలు ఏర్పాటు చేయడం ఖర్చుతో కూడుకున్న పని. గ్రామ పంచాయతీ కాని, ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసే విద్యుత్‌ కనెక్షన్‌ ఇస్తాం.

– రమేశ్‌, విద్యుత్‌ ఏఈ, కెరమెరి

నిధులు లేవు



శ్మశాన వాటికల్లో విద్యుత్‌ సరఫరా చేయాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ప్రస్తుత పరిస్థితుల్లో నిధులు లేక పంచాయతీలను నెట్టుకు రావడం కష్టతరంగా మారింది. అనుకున్న స్థాయిలో విడుదల కావాల్సిన నిధులు పంచాయతీలకు అందడం లేదు.

– అంజద్‌పాషా, ఎంపీడీవో కెరమెరి

బస్టాండ్‌లో దాహం.. దాహం

- మండుతున్న ఎండలు
- తాగునీటి సౌకర్యం కల్పించని అధికారులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌

కౌటాల: 'ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణించండి.. ఆర్టీసి బస్సుల్లోనే ప్రజలకు ప్రయాణం సురక్షితం' అంటూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు చెబుతుంటారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రయాణికులకు కనీస సౌకర్యాలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. కౌటాల మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కౌటాల మండల వాసులు, ప్రయాణికులతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రతీరోజు ఎన్నో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరవైయ్యాయి. వేసవిలో తాగునీరు చాలా అవసరం. కాని కౌటాల మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వాటర్‌ ప్యాకెట్లే దిక్కు..

కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు దాహం తీర్చేందుకు స్వయంగా డబ్బులు చెల్లించి స్థానిక కిరాణాషాపుల లో వాటర్‌ బాటిలు, వాటర్‌ ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్‌ మండలాలకు ప్రధాన ప్రయాణ ప్రాంగణంగా ఉంది. దీంతో కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రతీరోజు ఎంతో మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

ఇబ్బందుల్లో ప్రయాణికులు..

మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్‌ కార్యాలయాలకు ప్రతీ రోజు వందలాది మంది ప్రజలు వస్తుంటారు. వీరంతా తిరుగు ప్రయాణంలో కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌ నుంచి ఆర్టీసీ బస్సులకు వెళ్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో నీటి వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని లక్కారం గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం పోచమ్మ ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆలయంలో తాగునీరు, బోర్‌బావి, రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.